సాక్షి
నిజామాబాద్
శనివారం ၊ 21 ၊ సెప్టెంబర్ ၊ 2024



హత్యకు యత్నించింది భార్యే
బంజార తండాలో ఇటీవల చోటుచేసుకున్న యువకుడిపై హత్యాయత్నం కేసును పోలీసులు ఛేదించారు.
- 8లో ▸



ఆటలతో మానసికోల్లాసం
విధి నిర్వహణలో బిజీగా ఉండే అటవీ శాఖ అధికారులకు ఆటలు మానసికోల్లాసాన్ని ఇస్తాయని ఎమ్మెల్యే ధన్‌పాల్ అన్నారు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
39.1 /22.3

వాతావరణం
ఉదయం చల్లని గాలులు వీస్తాయి. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

ప్రజారోగ్యంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



ఇందల్వాయి: ప్రజారోగ్యంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు హెచ్చరించారు. ఇందల్వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన డీఎంహెచ్‌వో రాజశ్రీతో కలిసి శుక్రవారం తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అటెండెన్స్ రిజిస్టర్ తనిఖీ చేసి ముందస్తు సమాచారం లేకుండా విధులకు గైర్హాజరైన సిబ్బంది తీరుపై అసహనం వ్యక్తం చేశారు. విధుల్లో లేని సిబ్బందికి మెమోలు జారీ చేయాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. మందులను నిల్వ చేసే రిఫ్రిజిరేటర్‌లను వాడకపోవడంపై సిబ్బంది తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సీసీ నాగరాజు, సిబ్బంది ఉన్నారు.

నూతన చట్టాలపై అవగాహన ఉండాలి



ఖలీల్‌వాడి: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని సీపీ కల్మేశ్వర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బోర్గాం బ్రిడ్జి వద్ద గల భూమారెడ్డి కన్వెన్షన్ హాల్‌లో నూతన చట్టాల మీద మీడియా ప్రతినిధులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీపీ మాట్లాడుతూ.. జులై 1 కొత్త చట్టాలు అమలులోకి వచ్చిన తరుణంలో పలు కేసుల దర్యాప్తు, విచారణలో పాటిస్తున్న విధానాలపై వివరించారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) కోటేశ్వరరావు, అదనపు డీసీపీ (ఏఆర్) శంకర్ నాయక్, ఏసీపీలు రాజావెంకట్‌రెడ్డి, బస్వారెడ్డి, శ్రీనివాస్, శ్రీనివాస్ రావు, నాగయ్య, నారాయణ, రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు బిల్లులు విడుదల

నిజామాబాద్ అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాల్లో మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు బిల్లులు విడుదల చేసినట్లు డీఈవో దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు వంట ఖర్చులకు సంబంధించి రూ.70,64,071, సీసీహెచ్‌ల గౌరవ వేతనం రూ.22,37,000 మండలాల వారీగా ఎంఈవోల అకౌంట్‌లలో జమ చేశామన్నారు. అలాగే గుడ్ల బడ్జెట్ రూ.కోటి విడుదలైనట్లు తెలిపారు. మరో రెండు రోజుల్లో ఏజెన్సీల ఖాతాలో జమ చేస్తామని పేర్కొన్నారు.

ఉద్యాన శాఖ కార్యాలయం మార్పు

డొంకేశ్వర్(ఆర్మూర్): కలెక్టరేట్‌లో ఉద్యానవన శాఖ కార్యాలయాన్ని మార్చారు. కలెక్టరేట్‌లో ఇది వరకు 208 నంబరు గదిలో ఉన్న కార్యాలయాన్ని రెండో అంతస్తులోని 203 నంబరు గదిలోకి మార్చినట్లు ఆ శాఖ డీడీ శ్రీనివాస్ తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు.

టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష పదవికి కిషన్ రాజీనామా

నిజామాబాద్ అర్బన్: టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష పదవికి అలుక కిషన్ రాజీనామా చేశారు. ఈ మేరకు రాష్ట్ర సంఘానికి తన రాజీనామా పత్రాన్ని అందజేశారు. గెజిటెడ్ హోదా కలిగిన వారు సంఘంలో కొనసాగవద్దని కేంద్ర సంఘం ఆదేశాలు జారీ చేసింది. రెండు నెలల క్రితమే ఆదేశాలు జారీ అయ్యాయి. దీనిపై 'సాక్షి' పత్రికలో శుక్రవారం ప్రచురితమైంది. దీంతో ఆయన రాజీనామా చేసినట్లు ప్రకటించారు. రెండు రోజుల క్రితమే రాజీనామా అందజేశానని చెప్పారు. త్వరలోనే జిల్లా అధ్యక్ష పదవికి ఎన్నిక నిర్వహిస్తామని పేర్కొన్నారు.

సన్నాలకు బోనస్

డొంకేశ్వర్: సన్న రకాల వడ్లకు రూ.500 బోనస్ అందజేసే విషయంలో ముందడుగు పడింది. శుక్రవారం రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. దీంతో జిల్లా రైతుల్లో హర్షం వ్యక్తం అవుతోంది. సన్నరకాలు సాగు చేసిన వారికే బోనస్ ఇస్తామని చెప్పడంతో ఖరీఫ్‌లో రైతులంతా సన్నాలు సాగు చేశారు. జిల్లాలో 42.97లక్షల ఎకరాల్లో వరి సాగైంది. ఇందులో 90 శాతం సన్నాలే ఉన్నాయి. మరో వారం పది రోజుల్లో జిల్లాలో వరి కోతలు ప్రారంభం కానున్నాయి.

స్టేడియం వైపు అడుగులు



నగరంలోని కలెక్టరేట్ మైదానం


ఇందూరుకు స్టేడియం కావలెను

'సాక్షి'లో ప్రచురితమైన కథనం..

జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ గ్రౌండ్‌లో స్టేడియం నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయించింది. చుట్టూ సింథటిక్ ట్రాక్, మధ్యలో ఫుట్‌బాల్ తదితర క్రీడలకు మైదానాలు ఏర్పాటు చేయనున్నారు. పక్కనే ఉన్న ద్వార్కా బజార్ స్థలంలో ఇండోర్ స్టేడియం నిర్మించనున్నారు. జూలై 27న 'ఇందూరుకు స్టేడియం కావలెను' శీర్షికతో 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. అదే రోజు అన్ని రాజకీయ పక్షాలు, క్రీడాసంఘాలు, ఇతర సంఘాల బాధ్యులతో 'సాక్షి' ఆధ్వర్యంలో స్టేడియం ఆవశ్యకతపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది.


స్టేడియం నిర్మించాల్సిందే!

'సాక్షి' ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం

- అక్టోబర్ మొదటివారంలో శంకుస్థాపన చేయనున్న సీఎం రేవంత్ రెడ్డి
- ఎల్లుండి జిల్లాకు రానున్న స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ చైర్మన్ శివసేనారెడ్డి
- పాత కలెక్టరేట్ స్థలంలో సింథటిక్ ట్రాక్, స్టేడియం నిర్మాణంపై పరిశీలన

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఇందూరు నగరంలో క్రీడా స్టేడియం, సింథటిక్ ట్రాక్ నిర్మాణానికి సంబంధించి అడుగులు వేగంగా పడుతున్నాయి. ఇక్కడ స్టేడియం కావాలనే డిమాండ్ చాలా ఏళ్ల నుంచి ఉన్నది. అంతర్జాతీయ క్రీడాకారులు ఎక్కువగా ఉన్న నిజామాబాద్ జిల్లాలో స్టేడియం కోసం పలువురు తమవంతుగా పోరాటాలు చేస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో గత జూలై 27న 'ఇందూరుకు స్టేడియం కావలెను' శీర్షికతో 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. అదే రోజు అన్ని రాజకీయ పక్షాలు, క్రీడాసంఘాలు, ఇతర సంఘాల బాధ్యులతో 'సాక్షి' ఆధ్వర్యంలో స్టేడియం ఆవశ్యకతపై పాత కలెక్టరేట్ గ్రౌండ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించడం జరిగింది. దీంతో స్పందించిన ప్రభుత్వం పాత కలెక్టరేట్ గ్రౌండ్‌లో చుట్టూ సింథటిక్ ట్రాక్ ఏర్పాటు చేసేందుకు నిర్ణయించింది. మధ్యలో ఫుట్‌బాల్ తదితర క్రీడలు ఆడేందుకు వీలుగా నిర్మాణాలు చేయనున్నారు. అదేవిధంగా దీని పక్కనే ఉన్న ద్వార్కా బజార్ స్థలంలో ఇండోర్ స్టేడియం నిర్మాణం చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. అక్టోబర్ మొదటి వారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్టేడియం శంకుస్థాపన కోసం నిజామాబాద్‌కు రానున్నట్లు సమాచారం.

ఆరెకరాల స్థలంలో..

ప్రస్తుతం ఉన్న పాత కలెక్టరేట్ మైదానంతో పాటు అక్కడ కూల్చివేసిన కలెక్టరేట్ స్థలం కలిపి సుమారు 6 ఎకరాల స్థలంలో స్టేడియం ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో 8 ట్రాక్‌లతో కూడిన సింథటిక్ ట్రాక్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నారు. ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ అథ్లెటిక్స్ ఫెడరేషన్ ప్రమాణాల మేరకు ఓవల్ షేప్ (కోడిగుడ్డు ఆకారంలో) ట్రాక్ లైన్ నిర్మించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఇందుకు గాను రూ.10 కోట్లు కేటాయించారు. ఈ నేపథ్యంలో ఈ నెల 23న స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ చైర్మన్ శివసేనారెడ్డి నిజామాబాద్‌కు రానున్నారు. శివసేనారెడ్డి కలెక్టర్‌తో పాటు అధికారులు, క్రీడా సంఘాలు, క్రీడాకారులను కలిసి వివరాలు సేకరించనున్నారు.

హైదరాబాద్‌లో కేంద్ర క్రీడల మంత్రి మాన్సుక్ మాండవీయ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలను కలిసి శివసేనారెడ్డి సమావేశం కానున్నారు. దీంతో శనివారమే ఉన్న ఆయన ఇందూరు పర్యటన రెండు రోజుల పాటు వాయిదా పడింది. కేంద్రమంత్రితో సమావేశంలోనూ నిజామాబాద్ స్టేడియం విషయం శివసేనారెడ్డి ప్రస్తావించనున్నారు.

క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీయడమే లక్ష్యం..



రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల యువతలోని ప్రతిభను వెలికితీసి, మెరికల్లాంటి క్రీడాకారులుగా తయారు చేసి అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటేలా చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళుతోంది. ఇందులో భాగంగా ఇప్పటికే యంగ్ స్పోర్ట్స్ అకాడమీ కోసం రూ.500 కోట్లు కేటాయించడం జరిగింది. మరోవైపు రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలించే లక్ష్యంతో సైతం యువతను క్రీడల వైపు ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి కృతనిశ్చయంతో ఉన్నారు. ఇక నిజామాబాద్ జిల్లా నుంచి అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటుతున్న క్రీడాకారులు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఇక్కడి నుంచే క్రీడాభివృద్ధికి రంగం సిద్ధం చేస్తున్నాం.

– శివసేనారెడ్డి, చైర్మన్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ

సీఎం ఫుట్‌బాల్ ఆడిన చోటే స్టేడియం..



శాసనసభ ఎన్నికల ముందు నిజామాబాద్ వచ్చిన రేవంత్‌రెడ్డి ఇదే మైదానంలో ఫుట్‌బాల్ ఆడారు. ప్రభుత్వం ఏర్పాటు చేశాక మొదటగా నిజామాబాద్ స్టేడియం శంకుస్థాపనకు పూనుకోవడం జిల్లాకు గర్వకారణం. స్టేడియం కావాలంటూ 2012లో నిరాహార దీక్ష చేశాను. అప్పటి నుంచి పోరాటం చేస్తున్నా 2022 డిసెంబర్ 21న క్రీడాకారులతో ర్యాలీ తీసి కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చాం. కలెక్టర్ ద్వారా స్పోర్ట్స్ అథారిటీకి వెళ్లింది. 2023 మేలో 3 కిలోమీటర్ల దూరం నగరంలో పరుగు తీశాను. ఈ పరుగుకు మహేష్‌కుమార్‌గౌడ్ జెండా ఊపి ప్రారంభించారు. తాజాగా ఆయన పీసీసీ అధ్యక్షుడు అయిన వెంటనే స్టేడియం మంజూరు కావడం సంతోషంగా ఉంది.

– సయ్యద్ ఖైసర్, అథ్లెటిక్స్ జాతీయ స్థాయి గోల్డ్ మెడలిస్ట్

ప్రభుత్వ ఆస్పత్రుల్లో పెరుగుతున్న సిజేరియన్లు

- పట్టించుకోని ఉన్నతాధికారులు

నిజామాబాద్ నాగారం: జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలు తగ్గుతున్నాయి. క్రమంగా సీజేరియన్లు పెరుగుతున్నాయి. పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో సిజేరియన్లు పెరుగుతున్నాయి. గతంలో కలెక్టర్ నారాయణరెడ్డి ఉన్నప్పుడు సాధారణ కాన్పులు చేయాలని ఆదేశాలు ఇచ్చారు. ఎప్పటికప్పుడు కమిటీ ద్వారా తనఖీలు చేయించారు. దీంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ డెలివరీలు 50 నుంచి 65 శాతం వరకు నమోదయ్యేవి. ప్రైవేట్ ఆస్పత్రుల్లో సైతం 20శాతం ఉన్న సాధారణ కాన్పులు కలెక్టర్ ఆదేశాలతో 36శాతం వరకు పెరిగాయి. అయితే ఆయన బదిలీ తర్వాత పర్యవేక్షణ కరువవడంతో క్రమంగా సిజేరియన్లు పెరుగుతున్నాయి.



పర్యవేక్షణ లేకపోవడంతో..

గతంలో కలెక్టర్ ఆదేశాలతో అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తు సాధారణ డెలివరీలు పెంచడానికి చర్యలు తీసుకున్నారు. దీంతో ఏఎన్‌ఎం, ఆశవర్కర్లు, ఇతర వైద్యసిబ్బందితో పాటు అంగన్‌వాడీ టీచర్లు కూడా గర్భిణులకు అవగాహన కల్పించేవారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే డెలివరీలు చేయించుకోవాలని, సాధారణ కాన్పుతో తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని వివరించేవారు. దీంతో క్రమంగా నార్మల్ డెలివరీలు పెరిగాయి. ఈ ఏడాది అధికారులు పెద్దగా దృష్టి పెట్టడం లేదు. దీంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెలివరీలు తగ్గిపోయాయి. అందులోను సిజేరియన్లు పెరగడం గమనార్హం. దీనిపై కలెక్టర్ దృష్టి పెట్టాలని పలువురు కోరుతున్నారు.

ఈ ఏడాది జిల్లాలోని ఆస్పత్రుల్లో ప్రసవాల వివరాలు

	నార్మల్		సిజేరియన్	
నెల	ప్రభుత్వ	ప్రైవేట్	ప్రభుత్వ	ప్రైవేట్
జనవరి	481	104	528	1,049
ఫిబ్రవరి	389	121	418	813
మార్చి	452	166	457	935
ఏప్రిల్	380	128	464	861
మే	371	119	457	845
జూన్	348	79	394	656
జూలై	341	67	418	601
ఆగస్టు	408	36	418	335

ప్రత్యేక దృష్టి సారిస్తా

నేను బదిలీపై జిల్లాకు వచ్చినప్పటి నుంచి సీజనల్ వ్యాధులపై ఎక్కువగా దృష్టి పెట్టాను. సీజనల్ వ్యాధులను అరికట్టడానికి ప్రజలకు అవగాహన కల్పిస్తు సిబ్బందితో కలిసి చర్యలు తీసుకుంటున్నా. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ డెలివరీలు పెంచడానికి ప్రత్యేకంగా దృష్టి పెడతాం.

– రాజశ్రీ, డీఎంహెచ్‌వో

ఆర్‌వోబీ నిర్మాణ పనులు వేగవంతం చేయండి

- రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్‌ను కోరిన ఎంపీ అర్వింద్

సుభాష్‌నగర్: పార్లమెంట్ పరిధిలో ప్రస్తుతం కొన సాగుతున్న ఆర్‌వోబీల నిర్మాణ పనులను వేగవంతం చేసేలా సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేయాలని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మ పురి కోరారు. ఈమేరకు శుక్రవారం ఢిల్లీలో రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో భేటీ అయ్యారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో రైల్వేలకు సంబంధించి, పెండింగ్‌లో ఉన్న పలు అంశాలను ఎంపీ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వారానికి ఒకసారి నడి చే కాజీపేట్ – దాదర్ రైలును వారానికి మూడుసార్లు నడిచేలా చర్యలు చేపట్టాలని ఎంపీ కోరగా, ఆ మేరకు చర్యలు తీసుకుంటానని మంత్రి హామీనిచ్చినట్లు ఎంపీ తెలిపారు. అవసరమైన చోట్ల కొత్త ఆర్‌వోబీలు, ఆర్‌యూబీల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయాలని కోరారు. ఢిల్లీకి నిజామాబాద్ మీదుగా రైలు సర్వీస్ నడపాలని విజ్ఞప్తి చేశారు. పెండింగ్‌లో ఉన్న ఆర్మూర్ – ఆదిలాబాద్, బోధన్ – బీదర్ రైల్వే లైన్ల మంజూరు చర్యలను వేగవంతం చేయాలని ఎంపీ మంత్రికి విన్నవించారు. అమృత్ భారత్ కింద రూ.53కోట్లతో చేపడుతున్న నిజామాబాద్ రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులను ఆయనకు వివరించారు.



రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్‌తో చర్చిస్తున్న ఎంపీ అర్వింద్

విప్లవోద్యమంలో జిల్లా పుటలు




మానాలలో నిర్మించిన మహిళా అమరుల స్మారక స్థూపం



జగన్ అలియాస్ శీలం నరేశ్




శంకర్ అలియాస్ మార్కండేయ



ప్రసాద్ అలియాస్ సందె రాజమౌళి



ఆజాద్ అలియాస్ గాజర్ల సారయ్య



ఆర్‌కే (రామకృష్ణ) అలియాస్ పోలెం సుదర్శన్‌రెడ్డి



జ్యోతక్క అలియాస్ స్వరూప

- ఉమ్మడి జిల్లాలో సమాంతర పాలన సాగించిన నక్సల్స్
- ఎన్‌కౌంటర్లు, లొంగుబాట్లతో కనుమరుగైన విప్లవోద్యమం
- నేడు మావోయిస్టు పార్టీ ఆవిర్భావ దినోత్సవం

తెలంగాణ విప్లవాల గడ్డ.. భూమికోసం, భుక్తికోసం ఎన్నో ఉద్యమాలు నడిచాయి. ఈ పోరాటాలలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు ప్రత్యేక స్థానం ఉంది. ఇక్కడ విప్లవ పార్టీల ఆధ్వర్యంలో సమాంతర పాలన సాగింది. అనంతర కాలంలో ఎన్‌కౌంటర్లు, లొంగుబాట్లతో నక్సలైట్ ఉద్యమం నీరుగారిపోయింది. సీపీఐ మావోయిస్టు పార్టీ ఆవిర్భవించి శనివారంతో ఇరవై ఏళ్లవుతున్న సందర్భంగా కథనం..

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లాలో 80వ దశకంలో నల్గొండ జిల్లాకు చెందిన విద్యార్థి నాయకుడైన రాంచందర్ అలియాస్ సత్యనారాయణ నేతృత్వంలో ముగ్గురు యువకులు సీపీఐ(ఎంఎల్) పీపుల్స్‌వార్ పార్టీ కార్యకలాపాలు షురూ చేశారు. కొద్దికాలానికే గోకుల్‌తండా ప్రాంతంలో ప్రమాదవశాత్తూ గ్రెనేడ్ పేలి వారు చనిపోయారు. ఆ తర్వాత సిరిసిల్ల పాలిటెక్నిక్ కాలేజీలో చదువుతున్న జగన్ అలియాస్ శీలం నరేశ్ జిల్లాలో పార్టీని ముందుకు తీసుకువెళ్లారు. రామారెడ్డి ప్రాంతంలో ప్రజలను వేధిస్తున్నాడని ఓ అటవీ అధికారిని చంపడంతో ఆయనకు ప్రజల్లో క్రేజ్ పెరిగింది. తర్వాత ఆయన ఉత్తర తెలంగాణ కార్యదర్శిగా పనిచేస్తున్నప్పుడు కొయ్యూరు ఎన్‌కౌంటర్‌లో చనిపోయారు. ఎల్లారెడ్డిపేటకు చెందిన శంకర్ అలియాస్ దొంత మార్కండేయ జిల్లాలో నాయకత్వ బాధ్యతలు చేపట్టి నక్సల్స్ కార్యకలాపాలు విస్తరించారు. కామారెడ్డి, సిర్నాపల్లి, భీంగల్, ఎల్లారెడ్డి, బాన్సువాడతో పాటు సిరిసిల్ల దళం కూడా జిల్లా కమిటీ పరిధిలో పనిచేసేది. అయితే సిర్నాపల్లి ప్రాంతంలో సరళ అనే యువతిని శంకర్ నేతృత్వంలో దళం చంపిన సంఘటన అప్పట్లో విమర్శలపాలైంది. సరళ ఉదంతంపై 'విరాటపర్వం' పేరుతో సినిమా వచ్చిన విషయం తెలిసిందే. జిల్లా కార్యదర్శితో పాటు ఉత్తర తెలంగాణ కమిటీ సభ్యుడి హోదాలో పనిచేసిన శంకర్ నిజామాబాద్‌లోని వినాయకనగర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో చనిపోయాడు. అప్పట్లో తొలి మహిళా దళనాయకురాలు నల్లవెల్లికి చెందిన స్వరూప అలియాస్ జ్యోతక్క సిర్నాపల్లి దళ కమాండర్‌గా పనిచేసి ఎన్‌కౌంటర్‌లో హతమయ్యారు. తర్వాత జిల్లా కార్యదర్శిగా హరిభూషణ్ అలియాస్ షామిర్ పాషా సుదీర్ఘకాలం పనిచేశారు. ఆయన పార్టీని వీడిన తర్వాత జిల్లా కార్యదర్శిగా ఆజాద్ అలియాస్ గాజర్ల సారయ్య, పద్మక్క అలియాస్ న్యాలకొండ రజిత, స్వామి అలియాస్ లోకేటి చందర్ తదితరులు పనిచేశారు.

ఆజాద్ కాలంలో మానాల సరిహద్దుల్లో ఇన్‌ఫార్మర్ల నెపంతో గిరిజనులను కాల్చిచంపిన ఘటనపై విమర్శలు వెల్లువెత్తాయి. ఆ సమయంలో జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన ప్రసాద్ అలియాస్ సందె రాజమౌళి పార్టీకి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు యత్నించారు. వరంగల్ జిల్లాకు చెందిన రామకృష్ణ (ఆర్‌కే) అలియాస్ పోలెం సుదర్శన్ రెడ్డి జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన తొలినాళ్లలోనే రైల్ ఇంజన్‌ను పేల్చిన సంఘటన అప్పట్లో సంచలనం కలిగించింది. కొంతకాలానికే ఆయన ఆదిలాబాద్ జిల్లా లక్ష్మీపూర్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో చనిపోయారు. రమేశ్ అలియాస్ గంగుల వెంకటస్వామి జిల్లా కార్యదర్శిగా కొనసాగుతున్నపుడే ప్రభుత్వంతో చర్చల ప్రక్రియ నడిచింది. మానాల అడవుల్లో 2005 మార్చి 7న జరిగిన ఎన్‌కౌంటర్‌లో రమేశ్‌తో పాటు పదిమంది నక్సల్స్ చనిపోయారు. ఈ ఎన్‌కౌంటర్‌తో జిల్లాలో మావోయిస్టుల ఉనికి లేకుండాపోయింది.

వందలాది మంది ఎన్‌కౌంటర్..

ఉమ్మడి జిల్లాలో తొలి ఎన్‌కౌంటర్ బస్వాపూర్‌లో జరిగింది. అప్పటి నుంచి 2005లో జరిగిన మానాల ఎన్‌కౌంటర్ వరకు వందలాది మంది నక్సల్స్ నేతలు, సానుభూతిపరులు ప్రాణాలు కోల్పోయారు. పీపుల్స్‌వార్ జిల్లా కమిటీ సభ్యులుగా పనిచేసిన ప్రసాద్ అలియాస్ రాజన్న, సలీం అలియాస్ రాములు, వినోద్ అలియాస్ రాజిరెడ్డి, సుధీర్ అలియాస్ లక్ష్మీనర్సయ్య, సంతోష్ అలియాస్ పెద్దోళ్ల రాములు, జనార్దన్ అలియాస్ నర్సింలు, స్వరూప అలియాస్ మొర్రి లస్మవ్వ, ఐలన్న, దయానందరెడ్డి, నారాయణ రెడ్డితో పాటు వందలాది మంది ఎన్‌కౌంటర్లలో చనిపోయారు.

దండకారణ్యంలో జిల్లా నేతలు

జిల్లాలో నక్సల్స్ కార్యకలాపాలు కనుమరుగైనప్పటికీ ఈ ప్రాంతానికి చెందిన పలువురు మావోయిస్టు పార్టీలో వివిధ హోదాల్లో పనిచేస్తున్నారు. ఇస్రోజీవాడీకి చెందిన స్వామి అలియాస్ లోకేటి చందర్ మూడున్నర దశాబ్దాలుగా అజ్ఞాతంలో ఉన్నారు. మావోయిస్టు పార్టీ ఆయనను దండకారణ్యానికి బదిలీ చేసింది. స్వామి రాష్ట్ర కమిటీ సభ్యుడి హోదాలో పనిచేస్తున్నట్టు పోలీసు రికార్డులు చెబుతున్నాయి. ఆయన భార్య సులోచన అలియాస్ నవత కూడా అజ్ఞాతంలో పనిచేసి ఎనిమిదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందింది. స్వామి కూతురు లావణ్య, కుమారుడు రమేశ్ కూడా దండకారణ్యంలో పనిచేస్తున్నట్టు తెలుస్తోంది. మాచారెడ్డి మండలం ఆరెపల్లికి చెందిన ఎర్రగొల్ల రవి అలియాస్ సంతోష్ దండకారణ్యంలో పనిచేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని మరికొందరు అజ్ఞాతంలో కొనసాగుతున్నా వారెక్కడ ఉన్నారన్నది తెలియదు.

విప్లవ పార్టీలు కలిసి..

అప్పటి పీపుల్స్‌వార్ నాయకత్వం దేశవ్యాప్తంగా విప్లవ పార్టీల ఐక్యత కోసం చేసిన ప్రయత్నాల్లో భాగంగా మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్ (ఎంసీసీ)తో కలిసి 2004 సెప్టెంబర్ 21న సీపీఐ మావోయిస్టు పార్టీ ఆవిర్భవించింది. మావోయిస్టు పార్టీ ఆవిర్భవించిన కొంతకాలం వరకు నక్సల్స్ ఉద్యమం చురుకుగా కొనసాగింది. తర్వాత వరుస ఎన్‌కౌంటర్లతో ఆ పార్టీ తీవ్రంగా నష్టపోయింది. ముఖ్యంగా నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో మావోయిస్టు కార్యకలాపాలు ఊపందుకుంటున్న సమయంలో మానాల అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్ ఆ పార్టీకి గట్టి దెబ్బ తగిలింది. తర్వాత జిల్లాలో నక్సలైట్ ఉద్యమం కనుమరుగైంది.

సమాంతర పాలన

మానాలలో 1997లో 51 అడుగుల మహిళా నక్సలైట్ల స్మారక స్థూపం నిర్మించారు. ఇది ఆసియా ఖండంలోనే పెద్దదిగా చెబుతారు. రెడ్డిపేట, కొండాపూర్, గూడెం, గిద్ద.. ఇలా చాలా గ్రామాల్లో అమరుల స్థూపాలున్నాయి. నక్సల్స్ కార్యకలాపాలు కొనసాగిన సమయంలో చాలా సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేవారు. మహిళలు, విద్యార్థినులను వేధించేవారిని గుర్తించి వారిపై దాడులు చేసిన సంఘటనలున్నాయి. కొన్నిచోట్ల పాఠశాలల అభివృద్ధికి సహకరించారు. మరికొన్నిచోట్ల శ్రమదానంతో చెరువులు తవ్వించారు.

క్లుప్తంగా

తిరుమల లడ్డూపై దుష్ప్రచారం సరికాదు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్‌: అత్యంత పవిత్రమైన, ప్రపంచంలోనే ప్రత్యేకత కలిగిన తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం విషయంలో చంద్రబాబు ప్రభుత్వం నిరాధార ఆరోపణలు చేయడం సరికాదని ఆలూరుకు చెందిన రైతు నాయకుడు గంగారెడ్డి అన్నారు. ఈ మేరకు గంగారెడ్డి శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. వైఎస్‌ జగన్‌ మోహన్‌రెడ్డి మీద రాజకీయ కక్షసాధింపు చేసే లక్ష్యంతో చంద్రబాబు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. దీంతో తిరుమల లడ్డూ ప్రతిష్ఠ తగ్గేలా హేయమైన చర్యకు పాల్పడ్డారన్నారు. ఇలాంటి నీచమైన రాజకీయాలు చేయడం మానుకోవాలన్నారు. తిరుమల వేంకటేశ్వరస్వామి చంద్రబాబుకు తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు.

బైబ్యాక్‌ ఒప్పందం చేసుకొని విత్తనాలు విక్రయించాలి



పెర్కిట్‌: రైతులతో బై బ్యాక్‌ ఒప్పందం చేసుకున్న తర్వాతే రైతులకు ఎర్రజొన్న విత్తనాలను విక్రయించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజీద్‌ హుస్సేన్‌ డీలర్లకు సూచించారు. ఆర్మూర్‌లోని రైతు వేదికలో శుక్రవారం ఆర్మూర్‌, భీమ్‌గల్‌, నిజామాబాద్‌ రూరల్‌ డివిజన్‌లోని విత్తన డీలర్లు, రైతులు, అధికారులకు ఎర్రజొన్న పంటపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లైసెన్సు లేకుండా విత్తనాలను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్డీవో రాజాగౌడ్‌, ఏసీపీ బస్వారెడ్డి, ఏడీఏలు విజయలక్ష్మి, శ్రీనివాస్‌, ప్రదీప్‌, ఏవో హరికృష్ణ పాల్గొన్నారు.

బీఈడీ పరీక్షల్లో ఒకరి డిబార్‌

తెయూ(డిచ్‌పల్లి): తెయూ పరిధిలోని బీఈడీ రెగ్యులర్‌ 2వ సెమిస్టర్‌ పరీక్షలు శుక్రవారం ఓ విద్యార్థి డిబార్‌కు గురైనట్లు అకడమిక్‌ ఆడిట్‌ సెల్‌ డైరెక్టర్‌ ఘంటా చంద్రశేఖర్‌ తెలిపారు. పరీక్షలకు 1,278 మందికి 1,224 మంది విద్యార్థులు హాజరయ్యారు. గిరిరాజ్‌ ప్రభుత్వ డిగ్రీ కాలేజ్‌ పరీక్షా కేంద్రంలో మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతూ ఓ విద్యార్థి డిబార్‌ అయినట్లు ఆయన పేర్కొన్నారు.

అరచేతిలో విద్యుత్‌ సమాచారం

- 19 ఫీచర్లతో టీజీఎన్‌పీడీసీఎల్‌ యాప్‌
- టోల్‌ ఫ్రీ నంబర్లు 18004250028, 1912



రవీందర్‌, ఎస్‌ఈ

సుభాష్‌నగర్‌: వినియోగదారులకు మరింత చేరువయ్యేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి 'టీజీఎన్‌పీడీఎస్‌' యాప్‌ను 19 ఫీచర్లతో అందుబాటులోకి తెచ్చింది. వినియోగదారులు తమ మొబైల్‌ ఫోన్‌లో యాప్‌ను డౌన్‌లోడ్‌ చేసుకుని 19 రకాల నాణ్యమైన సేవలు పొందవచ్చు. ఈ యాప్‌లో 24/7 పనిచేసే టోల్‌ ఫ్రీ నంబర్లు 18004250028, 1912 కూడా పొందుపర్చారు. కాగా విద్యుత్‌ వినియోగదారులు టీజీఎన్‌పీడీసీఎల్‌ యాప్‌ను డౌన్‌లోడ్‌ చేసుకుని సంస్థ నాణ్యమైన సేవలు పొందాలని, సంస్థ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూపరింటెండెంట్‌ ఇంజినీర్‌ (ఎస్‌ఈ) రాపెల్లి రవీందర్‌ తెలిపారు.

- **రిపోర్ట్‌ అన్‌ ఇన్సిడెంట్‌:** ఎక్కడైనా ఏదైనా ప్రమాదం జరిగితే జీపీఎస్‌ లొకేషన్‌ ద్వారా వినియోగదారుని ఫోన్‌ నుంచి ఫొటో తీసి పంపొచ్చు. తద్వారా రిపోర్ట్‌ నేరుగా సంబంధిత అధికారికి వెళ్తుంది. వెంటనే ఆ అధికారి స్పందించి సమస్యను పరిష్కరిస్తారు.
- **కన్స్యూమర్‌ గ్రీవెన్సెస్‌:** ఎ) న్యూ కంప్లైంట్‌: వినియోగదారునికి సంబంధించిన సమస్యలను నేరుగా ఇందులో పొందుపర్చవచ్చు. మీటర్‌ నంబర్‌, సమస్య తాలూకు వివరాలు ఇందులో నమోదు చేస్తే ఆ సమస్యను పరిష్కరిస్తారు. విద్యుత్‌కు సంబంధించిన ప్రతి అంశంపై ఫిర్యాదు చేసే సౌకర్యం ఉంటుంది.
- **బి) కంప్లైంట్‌ స్టేటస్‌:** ఫిర్యాదు చేసిన సమస్య స్టేటస్‌ను ఇందులో చూసుకునే సౌలభ్యం ఉంది.
- **సి) ఓపెన్‌ కంప్లైంట్‌:** ఫిర్యాదు చేసిన సమస్యపై సంతృప్తి చెందకపోతే మళ్లీ పునరావృతం చేసుకునే అవకాశం ఉంది.



- **సెల్ఫ్‌ రీడింగ్‌:** వినియోగదారులు సెల్ఫ్‌ రీడింగ్‌ చేసుకునే వెసులుబాటు కల్పించింది. ప్రతినెల వారి విద్యుత్‌ బిల్లులను స్వయంగా సెల్ఫ్‌ మీటర్‌ రీడింగ్‌ చేసుకోవచ్చు.
- **పే బిల్స్‌:** నెలవారి విద్యుత్‌ బిల్లులను వినియోగదారుల సర్వీస్‌ నంబర్‌ నమోదు చేసుకొని చెల్లించవచ్చు. ఇది చాలా సులభం, సౌకర్యవంతం, వేగవంతం, సురక్షితం, దీని ద్వారా సమయం ఆదా చేసుకోవచ్చు. కేవలం రెండు నిమిషాల్లో బిల్లు చెల్లించవచ్చు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతిఒక్కటి డిజిటలైజేషన్‌గా మారింది కావున ఇలా చెల్లించడం శ్రేయస్కరం.
- **బిల్‌ హిస్టరీ:** వినియోగదారులు చెల్లించిన విద్యుత్‌ బిల్లుల గత చెల్లింపును చూసుకోవచ్చు. తద్వారా ప్రతినెలా బిల్లు ఎంత వస్తుందో పోల్చుకోవచ్చు. అలాగే విద్యుత్‌ వినియోగం ఏ నెల ఎంత పెరిగిందని చూసుకుని, పొదుపు చేసుకునే అవకాశం ఉంటుంది.
- **ఆన్‌లైన్‌ పేమెంట్‌ హిస్టరీ:** ఆన్‌లైన్‌ ద్వారా చెల్లించిన సమాచారం ఉంటుంది. వినియోగదారులు ఆన్‌లైన్‌ ద్వారా చెల్లించిన సమాచారం తెలుసుకోవచ్చు.
- **లింక్‌ ఆధార్‌–మొబైల్‌:** వినియోగదారుల ఆధార్‌, మొబైల్‌ నంబర్లు లింక్‌ చేసుకోవడం వలన విద్యుత్‌ బిల్లుల ప్రతి సమాచారం ప్రతి నెల ఫోన్‌కు సమాచారం అందుతుంది. తద్వారా వెంటనే యాప్‌ ద్వారా బిల్లు చెల్లించవచ్చు.
- **డొమెస్టిక్‌ బిల్‌ క్యాలిక్యులేటర్‌:** వినియోగదారుల నెలవారి విద్యుత్‌ వినియోగం తాలూకు మీటర్‌ రీడింగ్‌ వివరాలు పొందుపరుస్తే పూర్తి సమాచారం చూపుతుంది.
- **కొత్త కనెక్షన్‌ ఎలా తీసుకోవాలి:** కొత్త విద్యుత్‌ కనెక్షన్‌ తీసుకోవడానికి సంబంధించిన పూర్తి వివరాలు యాప్‌లో పొందుపర్చారు. ఆ వివరాల అనుగుణంగా దరఖాస్తు చేసుకోవాలి.
- **పవర్‌ కంజంప్షన్‌ గైడ్‌లైన్స్‌:** విద్యుత్‌ ఉపకరణాలు ఎంత వాడితే ఎంత విద్యుత్‌ వినియోగం అవుతుందో సమాచారం ఉంటుంది.
- **టారిఫ్‌ సమాచారం:** విద్యుత్‌ వినియోగ చార్జీల వివరాలు కేటగిరీల వారిగా ఇందులో వివరంగా ఉంటాయి. గృహ, గృహేతర వినియోగదారులు, పరిశ్రమలు తదితర వివరాలు కేటగిరిల వారీగా చార్జీల వివరాలు పొందుపర్చారు.
- **ఎనర్జీ సేవింగ్‌ టిప్స్‌:** యాప్‌లో విద్యుత్‌ ఉపకరణాలు వాడుతున్నప్పుడు ఆచరించాల్సిన పొదుపు సూచనలు పేర్కొంది. విద్యుత్‌ పొదుపు చేయడానికి సూచనలు అనుసరించి పొదుపుగా వాడుకుని భవిష్యత్‌ తరాలకు అందించాలి.
- **ఫీడ్‌ బ్యాక్‌:** వినియోగదారులకు అందిస్తున్న సేవలపై అభిప్రాయాలు పంచుకోవచ్చు. ఇది చాలా ముఖ్యం. అందుకు అనుగుణంగా మార్పులు చేర్పులు చేసుకొని మరింత మెరుగైన సేవలు అందించేందుకు దోహదపడుతుంది.
- **మై అకౌంట్‌:** మై అకౌంట్‌లో వినియోగదారుల పూర్తి వివరాలు ఉంటాయి. వారి మీటర్‌ తాలూకు వివరాలు, తదితర సమాచారం ఉంటుంది.
- **అధికారి వివరాలు:** వినియోగదారుల పరిధిలోని అధికారిని సంప్రదించాలంటే యాప్‌ నుంచి తెలుసుకోవచ్చు. ఎలాంటి సందేహాలున్నా అధికారిని ఫోన్‌ ద్వారా సంప్రదించి నివృత్తి చేసుకోవచ్చు.

సమ్మె విరమించిన ఆరోగ్య మిత్రలు

నిజామాబాద్‌నాగారం: ఆరోగ్య మిత్రలు మూడు రోజులుగా సమ్మె చేయడంతో శుక్రవారం చర్చలు సఫలం కావడంతో సమ్మె విరమించారు. రాజీవ్‌ ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్‌ ట్రస్ట్‌లో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలపై ఆరోగ్యశ్రీ ట్రస్ట్‌ సీఈవో, ఆరోగ్య మిత్రల రాష్ట్ర కమిటీ నాయకులతో రాష్ట్ర వైద్యశాఖమంత్రి దామోదర్‌ రాజ నర్సింహా చర్చలు జరిపారు. ఇప్పటి వరకు ఉన్న రూ. 15600 వేతనాన్ని రూ. 19500కు పెంచారు. దీంతో పాటు ఏరియర్స్‌, సమ్మెకాలంలో ఓడీ కింద వేతనాలు సైతం చెల్లించనున్నారు. డిమాండ్లు పరిష్కారం కావడంతో జిల్లా నాయకులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

రైస్‌ మిల్లుపై అధికారుల దాడి



భిక్కనూరు: మండల సమీపంలోని విజయ గణపతి రైస్‌మిల్లుపై రాష్ట్ర పౌరసరఫరాల శాఖ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. రికార్డులను పరిశీలించారు. ధాన్యం బస్తాలను లెక్కించారు. ఎఫ్‌సీఐకి పంపించిన బియ్యం పత్రాలను పరిశీలించారు. తనిఖీల్లో ఓఎస్‌డీ శ్రీధర్‌రెడ్డి, టాస్క్‌ఫోర్స్‌ అధికారులు సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, భిక్కనూరు ఎన్‌ఫోర్స్‌మెంట్‌ డిప్యూటీ తహసీల్దార్‌ వై కిష్టయ్యతో పాటు భిక్కనూరు పోలీసులు పాల్గొన్నారు.

డయల్‌ 100 దుర్వినియోగం చేసిన వ్యక్తికి జైలు

ఇందల్వాయి: డయల్‌ 100 సేవలను దుర్వినియోగం చేసిన ఓ వ్యక్తికి జడ్జి రెండు రోజుల జైలు శిక్షను విధించారని ఎస్సై మనోజ్‌కుమార్‌ పేర్కొన్నారు. ఇందల్వాయి మండలంలోని ఎల్లారెడ్డిపల్లికి చెందిన మొహమ్మద్‌ బాబా అనే వ్యక్తి డయల్‌100 సేవలను దుర్వినియోగం చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో శుక్రవారం హాజరుపర్చారు. సాక్ష్యాలను పరిశీలించిన జడ్జి అతనికి రెండు రోజుల జైలు శిక్షను విధించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆటలతో మానసిక ఉల్లాసం

- అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణ గుప్తా
- రాజారాం స్టేడియంలో అటవీ ఉద్యోగుల క్రీడలు ప్రారంభం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సూర్యనారాయణ గుప్తా

డొంకేశ్వర్‌: విధి నిర్వహణలో నిత్యం బిజీగా ఉండే అటవీ శాఖ ఉద్యోగులకు క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని నిజామాబాద్‌ అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణ గుప్తా అన్నారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నాగారంలోని రాజారాం స్టేడియంలో నిర్వహించిన జోనల్‌ స్థాయి ఫారెస్టు స్పోర్ట్స్‌ అండ్‌ గేమ్స్‌ మీట్‌కు ధన్‌పాల్‌ ముఖ్య అతిథిగా హాజరై క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇందురు జిల్లా క్రీడలకు పెట్టిన పేరని, జిల్లా నుంచి ఎంతో మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన వారున్నారని గుర్తు చేశారు. నాలుగు జిల్లాలకు కలిపి నిజామాబాద్‌లో జోనల్‌ స్థాయి క్రీడలు నిర్వహించడం గర్వకారణమన్నారు. కార్యక్రమానికి ముందు క్రీడాకారులు మార్చ్‌పాస్ట్‌ నిర్వహించారు. కార్యక్రమంలో బాసర సర్కిల్‌ సీసీఎఫ్‌ శర్వానన్‌, వివిధ జిల్లాల డీఎఫ్‌వోలు నిఖిత, ప్రశాంత్‌ బాజీరావు పాటిల్‌, రవి ప్రసాద్‌, నాగిని బాను, రవీందర్‌, ఎఫ్‌డీవోలు సుధాకర్‌, భవానీశంకర్‌, అటవీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌ తదితరులు పాల్గొన్నారు.



మార్చ్‌పాస్ట్‌ నిర్వహిస్తున్న క్రీడాకారులు

డిచ్‌పల్లి సొసైటీ చైర్మన్‌పై అవిశ్వాసానికి యత్నం

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌ రాంచందర్‌ గౌడ్‌పై సొసైటీ డైరెక్టర్లు అవిశ్వాసం పెట్టేందుకు ప్రయత్నించారు. నాలుగు రోజుల క్రితం డైరెక్టర్లు డీసీవో శ్రీనివాసరావును కలిసినట్లు ఆలస్యంగా తెలిసింది. 2024ఫిబ్రవరి27న సొసైటీ చైర్మన్‌గా రాంచందర్‌ గౌడ్‌ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. నాటి నుంచి తమను ఏ మాత్రం పట్టించుకోకుండా సొంత నిర్ణయాలు అమలు చేస్తున్నాడని డైరెక్టర్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఎన్నికైన తర్వాత ఏడాది లోపు అవిశ్వాసం పెట్టడానికి వీలు లేదని డీసీవో తెలిపారు. దీంతో అవిశ్వాసం వీలు కాకపోతే తమ పదవులకు మూకుమ్మడిగా రాజీనామాలు చేసేందుకు డైరెక్టర్లు సిద్ధమవుతున్నారు. ఈ పంచాయితీ రూరల్‌ ఎమ్మెల్యే భూపతి రెడ్డి వద్దకు వెళ్లినట్లు తెలిసింది. ఆయన ఏ నిర్ణయం తీసుకుంటారో అని అందరిలో ఆసక్తి నెలకొంది.

ఏఎంసీ చెక్‌పోస్టు పునరుద్ధరణకు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్‌

బోధన్‌: సాలూర మండల శివారులోని మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న అంతర్రాష్ట్ర చెక్‌ పోస్టు వద్ద ఏఎంసీ చెక్‌పోస్టు పునరుద్ధరణకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని బోధన్‌ ఏఎంసీ చైర్‌పర్సన్‌ అంకు సంధ్యదామోదర్‌ తెలిపారు. గతంలో అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు రోడ్డు విస్తరణలో తొలగించబడిందని పేర్కొన్నారు. మళ్లీ చెక్‌ పోస్టు పునరుద్ధరణకు స్థల పరిశీలన చేస్తున్నట్లు వెల్లడించారు. శుక్రవారం సాలూర అంతర్రాష్ట్ర చెక్‌ పోస్టును ఏఎంసీ చైర్‌పర్సన్‌ వైస్‌ చైర్మన్‌ చీల శంకర్‌, డైరెక్టర్లతో కలిసి సందర్శించారు. ముందుగా బోధన్‌ మండలంలోని మినార్‌పల్లి శివారులోని చెక్‌పోస్టును పరిశీలించారు. ఏఎంసీ పరిధిలోని గోదాంలు, చెక్‌పోస్టుల స్థితిగతులు, పనితీరు పరిశీలించేందుకు పాలకవర్గ సభ్యులతో కలిసి సందర్శించినట్లు పేర్కొన్నారు. ఆమె వెంట డైరెక్టర్లు వసంత్‌రెడ్డి, ఎంబెల్లి గంగారాం, సంగెపు భూమయ్య, బాలకృష్ణారెడ్డి, రవిదాస్‌, కాంగ్రెస్‌ నాయకులు అల్లె రమేశ్‌, టింకల్‌ హన్మంత్‌రావు పటేల్‌ తదితరులు ఉన్నారు.

హత్యాయత్నానికి పాల్పడింది భార్యే..

- బంజారతండా ఘటనలో వీడిన మిస్టరీ
- విచారణలో నేరం అంగీకరించిన భార్య
- నిందితురాలిని అరెస్టు చేసిన పోలీసులు



మాట్లాడుతున్న సీఐ రవీందర్‌ నాయక్‌

నాగిరెడ్డిపేట: తరచూ అనారోగ్యానికి గురవుతున్న భర్తకు వైద్యం చేయించడం ఇష్టం లేని ఓ భార్య హత్యాయత్నానికి పాల్పడి కటకటాలపాలైంది. ఘటనకు సంబంధించి ఎల్లారెడ్డి సీఐ రవీందర్‌నాయక్‌ మండల కేంద్రంలోని పీఎస్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నాగిరెడ్డిపేట మండలం బంజారతండాకు చెందిన మోహన్‌, నిర్మల భార్యాభర్తలు. మోహన్‌ తరచూ అనారోగ్యానికి గురవుతుండడంతో అతనికి వైద్యం చేయించడం ఇష్టం లేని భార్య హత్య చేయాలని నిర్ణయించుకుంది. ఈ నెల 17న భర్త మోహన్‌ గొంతుపై గొడ్డలితో దాడి చేసి గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు ఇంట్లోకి చోరీకి పాల్పడ్డారని వారే హత్యాయత్నం చేశారంటు స్థానిక ప్రజలను నమ్మే ప్రయత్నం చేసింది. శుక్రవారం ఉదయం మండలంలోని గోపాల్‌పేట బస్టాండ్‌లో అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకొని విచారించారు. పోలీసుల విచారణలో తన భర్తను తానే గొడ్డలితో దాడి చేసినట్లు నేరం ఒప్పుకుంది. మోహన్‌ తరచూ అనారోగ్యానికి గురికావడం, పెద్ద మొత్తంలో నగదు ఖర్చవుతుండడం ఇష్టంలేకే ఈ దాడికి పాల్పడినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం మోహన్‌ హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నాడు. నిర్మలను అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాగా కేసును ఛేదించడంలో కృషిచేసిన కానిస్టేబుల్‌ గంగారాంను అభినందిస్తూ రివార్డును అందజేశారు. సమావేశంలో ఎస్సై మల్లారెడ్డి, కానిస్టేబుళ్లు గంగారాం, శ్వేత, హోంగార్డు రాజు ఉన్నారు.

ఆర్థిక సమస్యలతో ఒకరి ఆత్మహత్య

రెంజల్‌: ఆర్థిక సమస్యలతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన రెంజల్‌ మండలంలోని సాటాపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై సాయన్న బుధవారం తెలిపిన వివరాల ప్రకాకం.. గ్రామానికి చెందిన నవీన్‌(30) నందిపేట్‌ మండలం గంగాసరం గ్రామంలో పాలేరుగా పనిచేస్తున్నాడు. నెల రోజుల క్రితం ఇంటికి వచ్చిన అతను ఆర్థిక సమస్యలతో ఇంట్లో ఉన్న ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

క్రైం కార్నర్‌

చికిత్స పొందుతూ యువకుడి మృతి



రెంజల్‌: మండలంలోని బాగేపల్లి గ్రామానికి చెందిన పాముల చిన్న సాయిలు(34) అనే యువకుడు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. సాయిలు గ్రామంలోని అలీసాగర్‌ ఎత్తిపోతల పథకం పంప్‌ హౌస్‌లో అటెండర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం విధుల్లో ఉండగా అకస్మాతుగా కింద పడిపోవడంతో తలకు బలమైన దెబ్బతగిలి రక్తస్రావమైంది. కుటుంబీకులు వెంటనే నిజామాబాద్‌లోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.

బాలుడి అదృశ్యం



ఖలీల్‌వాడి: నగరంలోని మాలపల్లిలో ఓ బాలుడు అదృశ్యమైనట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు శుక్రవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్‌కు చెందిన జబీర్‌ అనే పదిహేనేండ్ల బాలుడు తల్లితండ్రులతో కలిసి మాలపల్లిలో నివాసం ఉంటున్నారు. వీరు ఇటీవల ఉపాధి నిమిత్తం జిల్లా కేంద్రానికి వచ్చారు. ఈ నెల 13న మాలపల్లిలో ఉన్న ఓ కటింగ్‌ షాప్‌లో పనిచేసేందుకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ ఫొటోలో ఉన్న బాలుడి ఆచూకీ తెలిసిన వారు 8712659837 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు.

కేబుల్‌ వైర్ల దొంగలకు దేహశుద్ధి

నవీపేట: మండలంలోని ఫతేనగర్‌–నాగేపూర్‌ శివారులోని వ్యవసాయ బోరు మోటర్లకు చెందిన కేబుల్‌ వైర్లు, ఫ్యూజలను ఎత్తుకెళ్తున్న ఇద్దరు నిందితులను ఫతేనగర్‌ గ్రామస్తులు గురువారం రాత్రి పట్టుకుని దేహశుద్ధి చేశారు. నవీపేటలోని తడగామ కాలనీకి చెందిన సాయిలు, భైంసాకు చెందిన పవన్‌ కొన్ని రోజుల క్రితం నవీపేట రైల్వే స్టేషన్‌లో పరిచయమయ్యారు. వీరు దొంగతనంలో ప్రావీణ్యం ఉండడంతో బోరు మోటర్ల కేబుల్‌, ఫ్యూజలపై దృష్టి సారించారు. కొన్ని రోజులుగా నవీపేట, నాగేపూర్‌, ఫతేనగర్‌ శివారులో తరచూ కేబుల్‌ వైర్లు చోరీకి గురవడంతో గ్రామస్తులు మాటువేశారు. నాగేపూర్‌ శివారులోని దాదవత్‌ వసంత్‌, నేనావత్‌ చందర్‌, కేతావత్‌ దేవిసింగ్‌, రంగారావులకు చెందిన కేబుల్‌, ఫ్యూజలను ఎత్తుకెళ్తుండడంతో గ్రామస్తులు పట్టుకుని దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. వసంత్‌ ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వినయ్‌ పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి



ఉమామహేశ్వరి మృతదేహం

డిచ్‌పల్లి: మండలంలోని ధర్మారం(బి) గ్రామానికి చెందిన దుబ్బాక ఉమా మహేశ్వరి(32) అనే వివాహిత శుక్రవారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఎండీ షరీఫ్‌ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఉమామహేశ్వరి 13 ఏళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన బాలస్వామిని ప్రేమించి పెళ్లి చేసుకుంది. వీరికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. బాలస్వామి పెయింటర్‌గా, ఉమామహేశ్వరి టైలరింగ్‌ పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. కొంత కాలంగా ఉమామహేశ్వరి మైగ్రేన్‌(ఒకవైపు తలనొప్పి)తో బాధపడుతోంది. అలాగే ఆర్థిక సమస్యలు ఉన్నాయి. శుక్రవారం భర్త బయటకు వెళ్లిన సమయంలో ఆమె ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కొద్ది సేపటికి ఇంటికి వచ్చిన భర్త విషయం గమనించి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడికి వచ్చి మృతదేహాన్ని కిందికి దించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పిచ్చి కుక్క దాడిలో ఏడుగురికి గాయాలు



కుక్క దాడిలో గాయపడ్డ బాలుడు విశ్వాస్‌, మల్లక్క

పెర్కిట్‌: ఆలూర్‌ మండల కేంద్రంలో శుక్రవారం పిచ్చికుక్క దాడి చేసిన ఘటనలో ఏడుగురు గాయాల పాలయ్యారు. కుక్క ఒకరి తర్వాత ఒకరిపై వరుసగా దాడి చేసి భయాభ్రాంతులకు గురిచేసింది. కుక్క దాడిలో గ్రామానికి మూడేళ్ల బాలుడు విశ్వాస్‌, గడీల మల్లక్క, తొర్తి సావిత్రి, లింగాల రాములు, బూర్గుల మల్లా గౌడ్‌, ఉమ్మెడ నల్లన్న, కత్తుల మోహన్‌ గాయాలపాలయ్యారు. దీంతో స్థానికులు కుక్కకాటుకు గురైన వారిని దేగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ చికిత్స అనంతరం మెరుగైన వైద్యానికి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అందరు కోలుకుంటున్నట్లు స్థానికులు తెలిపారు. అలాగే దాడికి కారణమైన కుక్కను గ్రామస్తులు పట్టుకుని ఊరి చివర వదిలేశారు. ఆర్మూర్‌ పట్టణంతో పాటు ఆర్మూర్‌, ఆలూర్‌ మండలాల్లో కుక్కల బెడద విపరీతంగా పెరిగిపోవడంతో ప్రజలు గడపదాటి బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఉన్నతాధికారులు స్పందించి కుక్కల బెడద నివారణకు చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఎలుగుబంటి దాడిలో మహిళకు గాయాలు

సిరికొండ: మండలంలోని మీరిబాయి తండాకు చెందిన ధర్మి అనే మహిళపై ఎలుగుబంటి దాడి చేయడంతో గాయాలయ్యాయి. ధర్మి ఆవులను మేపడానికి తండా సమీపంలోని అడవిలోకి శనివారం వెళ్లింది. ఆవులను మేపుతుండగా పొదల్లో దాగి ఉన్న ఎలుగుబంటి ఒక్కసారిగా ఆమెపై దాడికి పాల్పడింది. గాయాలతో తప్పించుకున్న ఆమె ఇంటికి చేరింది. వెంటనే కుటుంబీకులు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకురాగా వైద్యుల సూచన మేరకు జిల్లా కేంద్రానికి తరలించారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

బీబీపేట: కుమార్తె, కుమారుని వివాహాల కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన బీబీపేట మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రభాకర్‌ శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. బీబీపేటకు చెందిన శ్యాగ శ్రీనివాస్‌(48) అదే గ్రామానికి చెందిన యాదాగౌడ్‌ వ్యవసాయ పొలం వద్ద జీతం ఉన్నాడు. రోజులాగే ఉదయం పొలం వద్దకు వెళ్లిన శ్రీనివాస్‌ తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చిన పెద్ద కుమారుడు పర్శరాంలు పొలం వద్ద వెతుకగా చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. వారు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కుమార్తె, కుమారుడి వివాహాల కోసం చేసిన సుమారు రూ. 4 లక్షల అప్పులు కావడంతో ఎలా తీర్చాలో తేలియక ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

హత్య కేసులో ఇద్దరికి జీవితఖైదు

ఖలీల్‌వాడి: ఒక వ్యక్తిని హత్య చేసిన కేసులో ఇద్దరికి జీవిత కారాగార శిక్ష విధిస్తూ నిజామాబాద్‌ సెషన్స్‌ జడ్జి సునీత కుంచాల శుక్రవారం తీర్పు వెలువరించారు. జిల్లా కేంద్రంలోని నాగారం బ్రాహ్మణ కాలనీకి చెందిన షేక్‌ మజీద్‌ను హత్యచేసిన షేక్‌ జుబీర్‌కు, హత్యకు సహకరించిన షేక్‌ అతీక్‌కు జీవిత కారాగార శిక్ష విధించారు. ఎల్లమ్మగుట్టకు చెందిన షేక్‌ జుబీర్‌ భార్యను తన వెంట ఒక గంట పంపిస్తే రూ.2 వేలు ఇస్తానని షేక్‌ మజీద్‌ ఓ సమయంలో అన్నాడు. పలుమార్లు ఫోన్‌ చేస్తూ వేధించేవాడు. ఇతని వేధింపులు భరించలేక తన చిన్ననాన్న అయిన ఎల్లమ్మగుట్టకు చెందిన షేక్‌ అతీక్‌ను తన ఆటోలో వెంట పెట్టుకుని 2021డిసెంబర్‌29న నాగారం నుంచి మజీద్‌ను డిచ్‌పల్లి మండలం బర్ధీపూర్‌కు ఆటోలో తీసుకెళ్లారు. అక్కడ కల్లు తాగి ఆటోలో తిరుగు పయనమయ్యారు. తన భార్యపై అవమానకరంగా మాట్లాడిన మజీద్‌ను షేక్‌ జుబీర్‌ చాకుతో కడుపులో పొడిచాడు. ఆటో నడుపుతున్న షేక్‌ అతీక్‌ ఆటో ఆపి మజీద్‌ను వెనుక నుంచి బలంగా పట్టుకున్నాడు. దీంతో మరోసారి జుబీర్‌ కత్తితో పొడిచి హత్యచేశాడు. అనంతరం బర్ధీపూర్‌ శివారులోని కాలువలో మృతదేహాన్ని పడేశారు. విచారణలో నిందితులు నేరం చేసినట్లు రుజువు కావడంతో ముద్దాయిలు ఇద్దరికి జీవిత ఖైదుతోపాటు రూ.2 వేల జరిమానా విధించారు. జరిమానా చెల్లించకుంటే అదనంగా ఆరు నెలల జైలు శిక్ష విధించాలన్నారు.

మద్యం తాగి వాహనం నడిపిన ఒకరికి..

ఖలీల్‌వాడి: మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి మెజిస్ట్రేట్‌ రెండు రోజుల జైలు శిక్షను విధించినట్లు ట్రాఫిక్‌ సీఐ వీరయ్య శుక్రవారం పేర్కొన్నారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలో వాహనాల తనిఖీ చేపడుతుండగా మద్యం సేవించి బైక్‌ నడుపుతున్న ఓ వ్యక్తిని పట్టుకొని కౌన్సెలింగ్‌ ఇచ్చి కోర్టులు హాజరుపర్చినట్లు పేర్కొన్నారు. సాక్ష్యాలను పరిశీలించిన జడ్జి నిందితుడికి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు ట్రాఫిక్‌ ఏసీపీ నారాయణ, ట్రాఫిక్‌ సీఐ వీరయ్య తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



నందిపేట్‌: మండలంలోని శాపూర్‌లో షార్ట్‌ సర్క్యూట్‌తో ఓ ఇల్లు దగ్ధమైంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రొక్కడి సాయమ్మ తన ఇంటికి తలుపులు వేసి ఖార్కనాలో బీడీలు ఇవ్వడానికి వెళ్లింది. కొద్ది సేపటికి ఇంటి నుంచి పొగలు, మంటలు రావడంతో చుట్టుపక్కల వారు గమనించి తలుపులు తెరిచి చూడగా ఇంట్లో మంటలు వ్యాపించాయి. మంటలను ఆర్పే ప్రయత్నం చేసే లోగా ఇంట్లో ఉన్న రూ. 2 లక్షల నగదు, తులం బంగారం, బట్టలు, ఇతర సామగ్రి కాలి బూడిదయ్యాయి. ఇంటి నిర్మాణానికి రూ. 2 లక్షలు తీసుకు వచ్చానని, డబ్బుతో సహా అన్ని కోల్పోయామని బాధితురాలు తెలిపింది.

చందూర్‌లో చోరీ

రుద్రూర్‌: వర్ని పీఎస్‌ పరిధిలోని చందూర్‌ మండల కేంద్రంలో గురువారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. ఏఎస్సై నాగభూషణం తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రం లోని విఘ్నేశ్వర కాలనీకి చెందిన మామిళ్ల శ్రీనివాస్‌ ఇంటికి తాళం ఉండడంతో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఇంట్లో బీరువాలో ఉన్న ఏడు తులాల బంగారం, పది తులాల వెండి, సుమారు రూ.8వేల నగదు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రుద్రూర్‌ సీఐ జయేశ్‌రెడ్డి శుక్రవారం ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

బాలిక కిడ్నాప్‌

ఖలీల్‌వాడి: నగరంలోని ఖలీల్‌వాడి ప్రాంతంలో గురువారం రాత్రి ఓ బాలిక కిడ్నాప్‌కు గురైనట్లు తెలిసింది. నగరంలోని ఆరో టౌన్‌ ప్రాంతానికి చెందిన బాలికను ఓ యువకుడు ప్రేమిస్తున్నానంటు నమ్మించి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితుల పిర్యాదు మేరకు ఆరో టౌన్‌ పీఎస్‌లో అతనిపై పోక్సో కేసు నమోదైంది. కేసు నమోదైన నాటి నుంచి సదరు యువకుడు పరారీలో ఉన్నాడు.

ఇటీవల కేసు వాపసు తీసుకోవాలని, పెళ్లి చేసుకుంటామని ప్రతిపాదనలు తెచ్చాడు. కానీ బాలిక కుటుంబీకులు ఒప్పుకోలేదు. గురువారం బాలిక తన సోదరి డెలివరీ కోసం ఖలీల్‌వాడిలో ఉన్న ఓ ఆస్పత్రికి వెళ్తుండగా కిడ్నాప్‌కు గురైంది. కాగా బాలికను సదరు యువకుడే కిడ్నాప్‌ చేసి ఉంటాడని బాధిత కుటుంబీకులు పేర్కొంటున్నారు. ఈ విషయమై బాలిక కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.